## క్లుప్తంగా

### నేడు కోదాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**కోదాడరూరల్ :** కోదాడ పట్టణంలో దాదాపు రూ.50 కోట్ల పైచిలుకు నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కొమరబండ వై జంక్షన్ వద్ద ఆర్చీ నిర్మాణం (కోదాడ ముఖద్వారం), శ్రీరంగాపురం, బాలాజీనగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, 6, 18 వార్డుల్లో సీసీ, డ్రెయినేజీ పనులు, కోదాడ పెద్ద చెరువు సుందరీకరణ పనులు, ఖమ్మం క్రాస్ రోడ్‌లో అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు.

### రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవు

**కోదాడరూరల్ :** రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలో ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, విధిగా లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. కూడళ్లలో వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది బాల్తు శ్రీనివాస్, లింగరాజు ఉన్నారు.

### సాగర్ నీటితో చెరువులు నింపాలి

**నేరేడుచర్ల :** మండలంలోని చెరువులు, కుంటలను సాగర్ నీటితో నింపి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధినేత సుంకరి క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవి రాకముందే ఎండల తీవ్రత పెరగడం, బోర్లు, బావులు ఎండిపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సాగర్ నీటి విడుదలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. మిషన్ భగీరథ నీళ్లు కూడా అన్ని ప్రాంతాలకు అందడం లేదని, సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు.

### ప్రభుత్వ పాఠశాలలో చెట్లు నరికివేత

**నడిగూడెం :** మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని నిత్యం విద్యార్థులకు చెప్పే ఉపాధ్యాయులే ఏకంగా చెట్లను నరికివేశారు. ఈ ఘటన మండలంలోని రత్నవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఉపాధ్యాయులు నరికివేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారిని సంప్రదించగా దారికి అడ్డుగా ఉన్న చెట్లను వాచ్‌మెన్ తొలగించి ఉండవచ్చని తెలిపారు.

### సిమెంట్ బల్లాలు ఏర్పాటు

**హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో దాత పులిపాటి వెంకటేశ్వర్లు– సుజాత దంపతులు రూ.15 వేల విలువ గల 10 సిమెంట్ బల్లాలను గురువారం ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్ చార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించాలి

**మునగాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆక్రమణలను తొలగించాలని మండలానికి చెందిన సామాజిక కార్యకర్త జి.సైదులు జిల్లా కలెక్టర్, ఎస్పీని కోరారు. ఈమేరకు వారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఆస్పత్రి ఎదుట స్థానికి ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్నారని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు ఆసుపత్రి వైద్యాధికారి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు.

### ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికైన శోభన్‌బాబుకు సన్మానం



శోభన్‌బాబును సత్కరిస్తున్న సీపీఎం నాయకులు

**మునగాల :** మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి వెంకటయ్య –మైసమ్మ కుమారుడు శోభన్‌బాబు ఇటీవల ప్రకటించిన గురుకుల కళాశాల నియామక ఫలితాల్లో రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించి గురుకుల కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపిక అయ్యాడు. దీంతో గురువారం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో శోభన్‌బాబును సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి జిల్లేపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మాతంగి పుల్లయ్య, కొలిశెట్టి నాగయ్య, మాతంగి విజయ్, కోట వెంకన్న, మాతంగి ఆంజనేయులు, జిల్లేపల్లి భాస్కర్, కోట మంగయ్య, జిల్లేపల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

### డీజే నిర్వాహకులకు అవగాహన

**కోదాడరూరల్ :** డీజేలకు అనుమతి లేదని కోదాడ పట్టణ సీఐ టి.రాము తెలిపారు. గురువారం పట్టణ స్టేషన్ ఆవరణలో డీజే నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి డీజేలు నడిపిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# అన్నదాతపై 'నకిలీ' దెబ్బ

- రైతులకు నకిలీ వరి విత్తనాలు అంటగట్టిన దుకాణాదారుడు
- నాటు వేసిన 20 రోజుల్లోనే పొలం ఈనే దశకు చేరి తాలుగా మారిన గింజ
- పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



నకిలీ విత్తనాలతో సాగు చేసిన పొలం ఎదగకపోవడంతో వదిలేసిన రైతు



పొలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు (ఫైల్)

**చిలుకూరు :** నకిలీ విత్తనాల విక్రయాలపై అధికారుల చర్యలు కొరవడటంతో గ్రామాల్లో రైతులు మోసపోతూనే ఉన్నారు. యాసంగి సీజన్‌లో ప్రభుత్వం క్రాఫ్ హాలిడే ప్రకటించినప్పటికీ అప్పులు తీర్చాలని చిలుకూరు మండలంలో పలువురు రైతులు తమకున్న నీటి వనరుల ఆధారంగా వరి సాగు చేశారు. కానీ వ్యాపారులు నకిలీ విత్తనాలు అంటగట్టి వారిని నట్టేటా ముంచడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

**గతంలోనూ అదే దుకాణంలో.. కానీ**

చిలుకూరు గ్రామానికి చెందిన రైతులు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో ఓ విత్తనాల దుకాణంలో నుంచి యాసంగి సీజన్ ప్రారంభంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశారు. గ్రామానికి చెందిన రైతులు అమరగాని లింగరాజు 8 ఎకరాలు, మరీదు శ్రీను 4 ఎకరాలు, మండవ వెంకటేశ్వర్లు 10 ఎకరాలు, సాహెబ్ అలీ 2 ఎకరాలు మొత్తం 24 ఎకరాలకు వారు 10 కేజీలు సంచులను 650 రూపాయల చొప్పున విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే గతంలో కూడా వారు అదే దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేపట్టగా పంట బాగానే ఉందని దీంతో ఆ నమ్మకంతో ఈసారి కూడా అక్కడే విత్తనాలు తీసుకొచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

**పోలీస్ స్టేషన్‌కు చేరిన వ్యవహారం**

అయితే గడ్డిపల్లిలో కొనుగోలు చేసిన విత్తనాలతో రైతులు వరి సాగు చేపట్టగా నాటు వేసిన 20 రోజుల నుంచే పొలం కొద్దికొద్దిగా ఈనే దశకు చేరుకొని గింజలు తాలుగా మారుతూ వస్తున్నాయి. పొలం కూడా ఎదగడం లేదు. దీంతో బాధిత రైతులు విత్తనాల కంపెనీ ప్రతినిధులను ఆశ్రయించడంతో వారు పొలన్ని పరిశీలించి నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. కానీ వారు పొలం వద్దకు వచ్చి వెళ్లి 20 రోజులు అవుతున్నా వారి నుంచి ఎలాంటి స్పందని లేదని, తమకు న్యాయం చేయాలని చిలుకూరు పోలీస్‌స్టేషన్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాధిత రైతుల పొలాలను పరిశీలించారు. నివేదికను వ్యవసాయ శాఖ అధికారులకు పంపిస్తామన్నారని వారు అన్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయామని, సంబంధిత అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**నష్టపరిహారం ఇవ్వాలి**



దుకాణాదారుడు మాకు నకిలీ విత్తనాలు ఇవ్వడంతో తీవ్రంగా నష్టపోయాం. ఇప్పటికే ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి పెట్టాం. మాకు విత్తనాల కంపెనీ నష్టపరిహారం ఇవ్వాలి. నకిలీ విత్తనాలు ఇచ్చిన కంపెనీపై చర్యలు తీసుకోవాలి. మా లాగా ఏ రైతు నష్ట పోకూడదు. వారి లైసెన్స్‌లు రద్దు చేయాలి.

– మరీదు శ్రీను, బాధిత రైతు

### మున్సిపాలిటీకి నిధులు మంజూరుపై హర్షం

**హుజూర్‌నగర్ :** మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మినరల్ ఫండ్ నిధులు రూ 1.50 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి మంజూరు చేసిన రూ 1.50 కోట్లలో టౌన్ హాల్ అభివృద్ధి పనులకు రూ. కోటి, క్రిస్టియన్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు వినియోగిస్తారని తెలిపారు. నిధులు విడుదల చేసిన మంత్రి ఉత్తమ్‌కు పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

**చిలుకూరు :** మండలంలోని కొమ్ముబండతండా గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కాగా, బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు రావడంతో ఊరంతా కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రికార్డుల తనిఖీ



చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**చిలుకూరు :** కలెక్టర్ ఆదేశాల మేరకు చిలుకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు రేషన్ దుకాణాలను గురువారం మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి రూపేందర్‌సింగ్, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ నింబంధనల ప్రకారం పని చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షరీఫుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్య, సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**పాలకవీడు :** మండల కేంద్రం పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని పాలకవీడు, గుడుగుంట్లపాలెం, యల్లాపురం, సజ్జాపురం, బెట్టితండా, నాగిరెడ్డిగూడెం, బొత్తలపాలెం, హనుమయ్యగూడెం, పాడ్యాతండా, బెట్టిగూడెం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నరసింహనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు



తమ్మరలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సాయాగౌడ్

**కోదాడరూరల్ :** రేషన్ డీలర్లు నిబంధనల ప్రకారం నడుచుకోకుండా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ సాయాగౌడ్ అన్నారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో రేషన్ దుకాణాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా కొమరబండలోని లక్ష్మీగణపతి పార్‌బాయిల్డ్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకున్న రైస్ మిల్లర్లు త్వరితగతిన సీఎంఆర్ రైస్‌ను తిరిగి అందజేయాలనియ, గడువులోపు సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంగన్‌వాడీల్లో రికార్డులను పరిశీలించి, ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లై డీటీ రాంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

**గరిడేపల్లి :** మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి అమ్మవారు, స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోత్సవాలతో వైభవంగా నిర్వహించారు. తదనంతరం దాత ఓరుగంటి సుజాత– శ్రీనివాస్ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పయిడిమర్రి రంగనాథ్, ఎల్ల అంజన్‌రెడ్డి, బండా సీతారాంరెడ్డి, కానుగ విజయ్, ఆలయ అర్చకులు వేదంతా మోహనకృష్ణమాచార్యులు, కృష్ణఫణిచార్యులు, సుదర్శన శ్రీనివాసాచార్యులు, ఫణి, రాజన్‌ఆచార్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి



గరిడేపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్‌ప్రసాద్

**గరిడేపల్లి :** నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్ ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా కాపాడాలని కోరారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, ఎంఈఓ చత్రునాయక్, ఏపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఎస్ఓ శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత తదితరులు పాల్గొన్నారు.

## బేతవోలులో వైద్య శిబిరం



బేతవోలులో జ్వర బాధితులను పరీక్షిస్తున్న డాక్టర్ నవ్య, వైద్య సిబ్బంది

**చిలుకూరు :** మండలంలోని బేతవోలు గ్రామంలో ప్రజలు జ్వరాలు, నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది బేతవోలు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వరాల బారిన పడిన వారి రక్త నమునాలు సేకరించారు. జ్వరాల బారిన పడిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య, సీహెచ్ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### అధికారులు సన్మార్గంలో నడవాలి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

**మునగాల :** రాష్ట్రంలో పనిచేస్తున్న అధికార యంత్రాంగం సన్మార్గంలో నడవాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ బిషప్, ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ పాస్టర్ జె.సుదర్శనం తెలిపారు. గురువారం మునగాల మండల కేంద్రంలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డిలను వారి కార్యాలయాల్లో మండల పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ జిల్లా యూత్ కన్వీనర్ జె.జె.సామ్యూల్‌సన్, కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జె.లూకా, కోదాడ నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యులు ఆర్.ప్రకాష్, మండల అధ్యక్షులు సీహెచ్.ఆదాం, కోశాధికారి జాషువారాజు, వసంత్‌కుమార్, మహేష్‌పాల్, ఓబద్యా, అబ్రహం రాజు పాల్గొన్నారు.

### బీజేపీ విజయ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**కోదాడఅర్బన్ :** కోదాడ నియోజకవర్గంలో ఈ నెల 29 నుంచి మార్చి 1 వరకు జరిగే బీజేపీ విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం కోదాడలోని బీజేపీ కార్యాలయంలో వారు సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, అక్కిరాజు యశ్వంత్, నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవీటి శ్రీను, సాతులూరి హనుమంతరావు, చిలుకూరు శ్రీను, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం, శ్రీను, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

## కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేయాలి



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఎం నాయకులు



నేరేడుచర్ల : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**హుజూర్‌నగర్ :** రైతులకు, వ్యవసాయానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగజేసే నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు వక్కవంతుల కోటేశ్వరరావు, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. దేశ రాజధాని సమీపంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై హరియాణా పోలీసులు మారణ హోమానికి పాల్పడడాన్ని ఖండిస్తూ ఎస్‌కేఎం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో గురువారం నల్ల కండువాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా సెంటర్‌లో రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జడ శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, పోటు లక్ష్మయ్య, కాకి అజయ్, వై.రమేష్, నవీన్, డి.సత్యనారాయణ, పి.వాసుదేవ రావు, జడ వెంకన్న, సుందరి పద్మ, చందర్‌రావు, భిక్షం, హుస్సేన్, శ్రీనివాస్, వెంకన్న, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

**నేరేడుచర్ల :** ఖానౌరీ సమీపంలో నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ గురువారం నేరేడుచర్లలో సీపీఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు, నేరేడుచర్ల పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. 24 ఏళ్ల యువ రైతు శుభకరణ్‌సింగ్ మృతికి ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సింహాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న, రైతు సంఘం నాయకులు అంబటి భిక్షం, వెంకట్, శ్రీహరి, పఠాన్ హుస్సేన్, ఫాతిమాబేగం తదితరులు ఉన్నారు.

**రైతులపై కాల్పులు బాధాకరం**

**గరిడేపల్లి :** దేశరాజధాని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం కాల్పులకు తెగబడటం బాధాకరమని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె. యాకూబ్ అన్నారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారుడికి ప్రోత్సాహకం

**మఠంపల్లి :** మండలంలోని బీల్యానాయక్‌తండాకు చెందిన బానోతు సతీష్‌నాయక్ హైదరాబాద్‌లో చదువుతూ నేషనల్ మీట్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. నిరుపేద అయిన సతీష్‌నాయక్‌కు మఠంపల్లి శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి గురువారం రూ.5వేల ప్రోత్సాహకం అందజేశారు. ఈనెలలో ఢిల్లీలో జరగనున్న నేషనల్ మీట్ క్రికెట్ పోటీల్లో సతీష్ పాల్గొననున్నట్లు తెలిపారు.

### ఉజ్వల గ్యాస్ కనెక్షన్ పంపిణీ

**మునగాల :** మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్‌ను గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు వీరబోయిన శైలజ, వీరబోయిన కవిత, కొమ్మరాజు రమణ పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**మోతె :** మండల కేంద్రంలో గురువారం రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవాపురంనకు చెందిన కొరిపెల్లి విక్రమ్, ఉపాధ్యక్షుడిగా గుగులోతు సీతారాములు, కార్యదర్శిగా జంపాల నరేష్, కోశాధికారిగా కుంట నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కారంశెట్టి ప్రభాకర్, నవిలె రామకోటయ్యను ఎన్నుకున్నారు.

### 'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

**మునగాల :** మార్చి నెలలో పదవ తరగతి పరీక్షలు ఉన్నందున మునగాల మండల కేంద్రంలో పరీక్ష కేంద్రాలైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, న్యూప్రజ్ఞ పాఠశాలలను గురువారం ఎంపీడీఓ కె.రమేష్ దీన్‌దయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మునగాల గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను ఎంపీడీఓ తనిఖీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**నడిగూడెం :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న కోరారు. గురువారం నడిగూడెం మండలంలోని రామాపురంలో నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కళావలి, సురేంద్ర, విజయ్, కృష్ణమూర్తి, ఏఎన్ఎంలు మంజుల, శైలజ, శ్రీదేవి, కిరణ్, విజయకుమారి, రాధా, గీత, పద్మ, మంగ, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వాస్తుహోమం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి :** మండలంలోని చౌటపల్లిలో శ్రీరుక్మిణీసత్యభామసమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, స్వామివారికి అష్టోత్తర కలషాభిషేకం, వాస్తుసుదర్శన హోమం, బలిహరణ, నివేదన, నీరాజన మంత్రపుష్పాలు పూర్తిగావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సింగారపు సైదులు, మాజీ జెడ్పీటీసీ సింగారపు అరుణాసైదులు, వీరారెడ్డి, సైదులు, శివయ్య, మల్లీశ్వరి, ఈఓ ఎంపి లక్ష్మణ్‌రావు, అర్చకులు నరగిరినాథుని రామక్రిష్ణమాచార్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## కనుల పండువగా పరమపదోత్సవం



పరమపదోత్సవంలో పూజారులు, భక్తులు

**హుజూర్‌నగర్ :** పట్టణంలో శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం నమ్మాళ్వార్ల పరమపదోత్సవాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవతో ప్రారంభించి, నమ్మాళ్వార్ల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి విష్ణు, లక్ష్మి, రామానుజ అష్టోత్తరాలు తిరుప్పావై సేవ కాలాన్ని అనుసంధానం చేశారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానాచార్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

**హుజూర్‌నగర్ :** ఆత్మరక్షణ కోసం విద్యార్థినులు కరాటే నేర్చుకోవాలని సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్ మాధవిలత అన్నారు. బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా గురువారం హుజూర్‌నగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ పొందేందుకు విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం కరాటేపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సారికారత జిల్లా కోఆర్డినేటర్లు మాధురి, రేవతి, వినోద్, హెచ్ఎం లతీఫ్, పీఈటీ రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### తిరుపతమ్మ మాలధారుల ఇరుముడి మహోత్సవం

**నడిగూడెం :** మండల కేంద్రంలోని తిరుపతమ్మ ఆలయంలో గురువారం తిరుపతమ్మ మాలధారులు ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాలధారులు ఇరుముళ్లు ధరించి కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో గల తిరుపతమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గునుగుంట్ల రమేష్, పాల్వాయి వీరబాబు, మొలుగూరి చినబాబు, చారాల పవన్, గోపి, తిరపయ్య, పోతురాజు భక్తులు పాల్గొన్నారు.

### యువత క్రీడల్లోనూ రాణించాలి



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థికి ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంపీపీ

**పాలకవీడు :** యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ (జూనియర్ విభాగం) పోటీలకు ఎంపికైన పాలకవీడు మండలంలోని కల్మేట్‌తండాకు చెందిన పదవ తరగతి విద్యార్థి రమావత్ బాలరాజును గురువారం ఆయన అభినందించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బాలరాజుకు రూ.15 వేల ఆర్థికసాయాన్ని ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా నాగరాజు, శోభన్, రాము తదితరులు పాల్గొన్నారు.

### క్రైస్తవుల ఉపవాస దీక్ష

**కోదాడఅర్బన్ :** కోదాడలోని నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపవాస దీక్ష గురువారం ఏడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, యేసు క్రీస్తు కీర్తనలను భక్తి శ్రద్ధలతో ఆలపించారు. కార్యక్రమంలో క్రైస్తవుల కుటుంబ సభ్యులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.